క్లుప్తంగా

ఘనంగా అంకాళమ్మ తిరునాళ్ల



అలంకరణలో అంకాళమ్మ

దొనకొండ: మండలంలోని చందవరంలో వెలసిన అంకాళమ్మ తిరునాళ్ల సోమవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆడపడుచులు పొంగళ్లు చేసి నైవేద్యాలు సమర్పించారు. గ్రామాన్ని చల్లగా చూడాలి తల్లీ..అంటూ వేడుకున్నారు. పిల్లా పాపలు సంతోషంగా జీవించాలని మొక్కుకున్నారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు



ఆటోలకు జరిమానా విధిస్తున్న ఎంవీఐ

దర్శి (కురిచేడు): పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని మోటారు వెహికల్ అధికారి ఏటీ రవికుమార్ హెచ్చరించారు. పొదిలి రోడ్డులో ఆర్టీసీ అధికారులతో కలిసి సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 27 ఆటోలను తనిఖీ చేశారు. అనుమతులు లేని ఆటోలకు రూ.25 వేల జరిమానా విధించినట్లు ఎంవీఐ రవికుమార్ తెలిపారు. ఆయన వెంట పొదిలి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ధనలక్ష్మి, ఎంవీ రావు, ఎం. షరీఫ్, జె.రామయ్య పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఏపీఎం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం క్రెడిట్ ప్లాన్, మొబైల్ బుక్ కీపింగ్, జియో ఫెన్సింగ్ ఫేషియల్ యాప్‌లపై వీఓఏలకు సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం మూల వెంకిరెడ్డి మాట్లాడుతూ క్రెడిట్ ప్లాన్‌లో ఎద్దైనా తప్పుగా నమోదు చేస్తే సీసీ లాగిన్‌లో మార్పులు చేసుకోవాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్‌కు మార్చి నాటికి ప్రారంభ నిల్వలు సిద్ధం చేసుకుని స్టార్టప్ బ్యాలన్స్ ఎంట్రీ చేసుకోవాలని పేర్కొన్నారు. స్త్రీ నిధి, ఉన్నతి, సీఐఎఫ్‌లు నూరు శాతం రికవరీ చేయాలని సూచించారు. సీసీలు మోహన రావు, శ్రీనివాసులు, అకౌంటెంట్ మల్లేశ్వరి, వీఓఏలు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం లేక అవస్థలు



దేశిరెడ్డిపల్లిలో తగలబడుతున్న కందిగూళ్లు (ఫైల్)



రుద్రసముద్రంలో కాలిపోయిన సోలార్ ప్యానెల్ (ఫైల్)

దొనకొండ: మండలంలో 18 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి వేసవిలో మండల పరిధిలో ఏదో ఒకచోట అగ్ని ప్రమాదం జరుగుతూనే ఉంది. సకాలంలో రావాల్సిన అగ్నిమాపక వాహనం అందుబాటులో లేకపోవడంతో అది వచ్చే సరికి జరగాల్సిన నష్టం అంతా జరిగిపోతోంది. దొనకొండలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే అందుబాటులో ఉంటుందని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో గ్రామాల్లో అనేక చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. దూరపు ప్రాంతం నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. దీంతో రైతులు పండించుకున్న పంటలు పొలాల వద్ద ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులు, మోటార్లు పూర్తిగా దగ్ధమైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామాల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దొనకొండలో ఫైర్ ఇంజిన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



ఫైరింజన్ లేక ఇబ్బందులు: దొనకొండ ప్రాంతంలో ఫైరింజిన్ లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. మార్కాపురం లేదా దర్శి నుంచి ఫైరింజన్ రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల అనేక ఇబ్బందులు జరిగాయి. దొనకొండకు ఫైరింజిన్ ఉంటే మండల ప్రజలకు మేలు జరుగుతుంది.

– గొంగటి పోలిరెడ్డి, బసిరెడ్డిపల్లి



అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి: దొనకొండ ప్రాంతంలో 18 పంచాయతీల్లో మెట్ట గ్రామాలు ఉన్నాయి. నీటి వసతి లేదు. వేసవి కాలంలో ఏటా అగ్నికి తీవ్రమైన నష్టం జరుగుతోంది. మా ఊరిలో గతంలో సోలార్, సిస్టం, డ్రిప్‌పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. దొనకొండ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే మాకు బాగుంటుంది.

– చెన్నుబోయిన గురుమూర్తి, రుద్రసముద్రం

మహిమాన్వితుడు వేణుగోపాలుడు



వేణుగోపాలస్వామి మూలవిరాట్



రుక్మిణి అమ్మవారి మూలవిరాట్



వేణుగోపాల స్వామి ఆలయం

- ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు
- నేటి వేకువ జామున రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలుడికి తలంబ్రాలు

యర్రగొండపాలెం: ప్రశాంతతకు నిలయంగా అపురూప శిల్పకళా సంపదతో శ్రీ రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి దేవాలయం విరాజిల్లుతోంది. యర్రగొండపాలెం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో 1440 సంవత్సరంలో అక్కమ్మ అనే భక్తురాలు ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు దేవాలయంలో ఉన్న శాసనాల ద్వారా తెలుస్తోంది. పూర్వం ఈ ప్రాంతంలో మిల్లంపల్లె గ్రామం ఉండేది. ఈ గ్రామానికి చెందిన అక్కమ్మ తన సొంత ఖర్చుతో వేణుగోపాల స్వామి దేవాలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. తన యావదాస్తి దేవాలయ నిర్మాణానికి వెచ్చించినట్లు చెబుతారు. భక్తురాలి ఆస్తి గోపుర నిర్మాణ సమయానికి హరించిపోవడంతో గోపుర నిర్మాణం చేపట్టలేక పోయారని, అందుకే పైకప్పు ఖాళీగా ఉందని ఈ ప్రాంత భక్తులు అనుకుంటుంటారు. ఆమె తదనంతరం దేవాలయం గోపుర నిర్మాణానికి ఎవరూ పూనుకోక పోవడంతో శతాబ్దాల కాలం నుంచి గోపుర నిర్మాణం ఆగిపోయింది. గోపుర నిర్మాణం జరిగితే ఈ దేవాలయంతో పాటు గ్రామం అభివృద్ధి చెందిఉండేదని, వేద పండితులు చెపుతున్నారు. కొందరు మాత్రం శ్రీకృష్ణ దేవరాయల సైన్యంలో ఒకరు మిల్లంపల్లె దేవాలయ నిర్మాణం చేపట్టినట్లు చెబుతున్నా అందుకు తగిన ఆధారాలు, శిలాశాసనాలు లేక పోవడంతో అక్కమ్మ అనే భక్తురాలే ఈ దేవాలయ నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. మిల్లంపల్లె గ్రామానికి చెందిన అక్కమ్మ ఈ దేవాలయాన్ని నిర్మించడం, దేవాలయం మిల్లంపల్లెలో ఉండటంతో, మిల్లంపల్లె వేణుగోపాల స్వామి దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. శ్రీరుక్మిణ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి దేవాలయం విశాల ప్రాంగణంతో మధ్యరంగం, కళ్యాణ మండపం, యాగశాల, వంటశాల వంటి కట్టడాలు విడివిడిగా ఉన్నాయి. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమికి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. 9 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో 5వ రోజు గరుడ సేవ, 7వ రోజు రథోత్సవం ఈ ప్రాంత ప్రజలు వేడుకగా జరుపుకుంటారు. సోమవారం రాత్రి నుంచి స్వామి వారి కల్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం వేకువ జామున రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఈ దేవాలయానికి విలువైన భూములు ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ ఆలయానికి సరైన రక్షణ లేక పోవడంవలన గతంలో గుర్తు తెలియని వ్యక్తులు అనేక పర్యాయాలు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు.



దర్శనమిస్తున్న రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలుడు

వేణుగోపాలుని ఆస్తులు

యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో దాదాపు 75 ఎకరాల విలువైన భూములు ఉన్నాయి. అయినా ఆలయాన్ని అభివృద్ధి పరచడంతో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు కృషి చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ దేవాలయానికి గాలిగోపుర నిర్మాణం చేపట్టి యర్రగొండపాలెం నుంచి మిల్లంపల్లె వేణుగోపాలస్వామి దేవాలయం వరకు సిమెంటు రోడ్డు నిర్మించాలని ఈ ప్రాంత ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

కార్యకర్త మృతిపై బూచేపల్లి సంతాపం



మాల్యాద్రి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని కంభంపాడు పంచాయతీ బట్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సుద్దపల్లి మాల్యాద్రి (55) ఆకస్మిక మృతిపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మురళి సోమవారం గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాల్యాద్రి కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాస్‌రెడ్డి, కంభంపాడు సర్పంచ్ రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగదారులకు జరిమానా



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

ముండ్లమూరు (కురిచేడు): విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్న 22 మందిపై విద్యుత్ అండ్ విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించి రూ.2.19 లక్షల అపరాధ రుసుం విధించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం 34 మంది అధికారులు, 102 మంది సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి 3,460 సర్వీసులు తనిఖీ చేసినట్లు డీపీఈ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీ ఉషారాణి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసులు సంయుక్తంగా తెలిపారు. మీటరు ఉండి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురికి రూ.1.60 లక్షలు, అనుమతించిన కేటగిరిగాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఐదుగురికి రూ.28 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న ఏడుగురికి రూ.17 వేలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన ఇద్దరికి రూ.10 వేలు, మీటరు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.4 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ తమ ప్రాంగణాల్లో ముండే మీటర్లకు తప్పని సరిగా సీలు ఉండేలా చూసుకోవాలన్నారు. దాడుల్లో సీఐ విజిలెన్స్ బీటీ నాయక్, డిఈఈలు శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, డీవీ కృష్ణారెడ్డి, డి.హరిబాబు, ఏఈఈ పాల్గొన్నారు.

అర్హులకు అన్నదాత సుఖీభవ



రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: ప్రభుత్వం అర్హులకు అన్నదాత సుఖీభవ వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. సోమవారం పెద్దారవీడు పడమటిపల్లె రామాలయం వద్ద అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పథకం ద్వారా రైతు బ్యాంక్ ఖాతాకు నేరుగా రూ. 20 వేలు జమ చేస్తుందన్నారు. రైతు సేవా కేంద్రంలో తమ ఆధార్ కార్డు, పట్టాదారుని పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ పుస్తకం, రేషన్ కార్డు జిరాక్స్‌లు వీఏఏలకు అందజేసి అప్రూల్ చేయించిన తదుపరి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపన్ను చెల్లించే వారు, విశ్రాంతి ఉద్యోగులకు ఈ పథకం వర్తించదని సూచించారు. మొదటి విడత జూన్ నెలలో రూ.7 వేలు, రెండో విడత సెప్టెంబర్ నెలలో రూ.7 వేలు, మూడో విడత డిసెంబర్ నెలలో రూ.6 వేలు రైతు ఖాతాలో వేస్తారన్నారు. భూసార పరీక్షలతో కలిగే లాభాల గురించి వివరించారు. భూసార పరీక్షలతో ఎంతెంత నిష్పత్తిలో ఎరువులు వాడాలో తెలుస్తుందని, గతేడాది భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశామన్నారు. కౌలు రైతులు ఉంటే తక్షణమే సీసీఆర్‌సీ కార్డ్సని నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ దుగ్గెంపుడి ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

రుక్మిణి అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



వెండి కిరీటంతో దర్శనం ఇస్తున్న అమ్మవారు

యర్రగొండపాలెం: స్థానిక వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రుక్మిణి అమ్మవారికి పట్టణ ఆర్యవైశ్యులు సోమవారం వెండి కిరీటాన్ని బహూకరించారు. దాదాపు రూ.30 వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని వారు దేవస్థానం కమిటీ అధ్యక్షుడు యక్కలి బాలవెంకటేశ్వర్లుకు అప్పజెప్పారు. కార్యక్రమంలో త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, వేణుగోపాల స్వామి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు యక్కలి భాగ్యారావు, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఆ సంఘం నాయకులు సూరె వెంకటస్వామి, పరిమి చంద్రశేఖర్, ఐ.వాసు, కాకుమాను హనుమంతురావు, యక్కలి పుల్లారావు, గ్రంథే రమణరావు, యక్కలి శివప్రసాద్, పరిమి ప్రసాదరావు, కాకుమాను సురేష్ పాల్గొన్నారు.

తీగలేరు కాలువ పనులకు సహకరించాలి



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

పుల్లలచెరువు: తీగలేరు కాలువ నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని తీగలేరు సాధన సమితి కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కవలకుంట్ల పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యమ వక్తలు జానకి రఘు, గురునాథం మాట్లాడుతూ పుల్లలచెరువు మండలం తీవ్ర కరువు పరిస్థితులో ఉందని, తాగు, సాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టును ఇంకా పూర్తి చేయకపోవడం విచారకమన్నారు. ప్రాజెక్టు నుంచి వచ్చే టి5 కాలువను పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించే విధంగా చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోస్టుకార్డుల ద్వారా ప్రభుత్వానికి చేరే విధంగా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి టి5 కాలువను సాధించే వరకు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమితి అధ్యక్షుడు రఘు, సభ్యులు కోటిరెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, నారు వెంకటరెడ్డి, పిచ్చిరెడ్డి, కేశవనారాయణరెడ్డితో పాటు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బోధనంపాడు మాజీ సర్పంచి మృతి



బత్తుల చిన సుబ్బయ్య (ఫైల్)

కురిచేడు: మండలంలోని బోధనంపాడు మాజీ సర్పంచి బత్తుల చిన సుబ్బయ్య (82) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై గుంటూరు వైద్యశాలలో చికిత్స అనంతరం స్వగ్రామానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించి మృతి చెందాడు. సర్పంచిగా 2014–19 వరకు పని చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహించి గ్రామంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన మృతిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ వేమా శివ, నాయకులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు





ఓబులక్కపల్లిలో ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి, హోమానికి హాజరైన దంపతులు

పెద్దారవీడు: మండలంలోని ఓబులక్కపల్లి వీరభద్ర స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. గ్రామ అర్చకులు పెరుగుపల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం, కుంభాభిషేకం, పూజలు చేశారు. దంపతులు హోమం పూజలో పాల్గొన్నారు. స్వామికి పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం కోలాటం ప్రదర్శించారు. మేళ తాళాలతో పురవీధుల నుంచి స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారు ఇంటి ముందుకు రాగానే మహిళలు నీటి బిందెతో వారు పోసి దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఎంపీడీఓగా సునీత బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న సునీత

ముండ్లమూరు (కురిచేడు): ఎంపీడీఓగా పి.సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన జనార్దన్ తన స్థానానికి పరిమితమయ్యారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ మండల అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఆమెకు కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరాలు చిన్నారులకు వరం



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు

పెద్దారవీడు: వేసవి శిక్షణ తరగతులు చిన్నారులకు వరమని గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శిక్షణ తరగతుల సందర్భంగా శిక్షకులు గౌతిమి సోమవారం విద్యార్థులకు కథలు, పుస్తక సమీక్ష, ఆట, పాటలు, నీతి కథలు, పద్యాలు, తదితర అంశాలు సోమవారం నేర్పించినట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను ఉపయోగించుకోవాలని, విజయవంతం చేయాలని కోరారు. తొలుత అమర జవాన్ దివంగత మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సైన్స్ ప్రాధాన్యతను తెలుసుకోవాలి

సంతనూతలపాడు: స్థానిక సుందరయ్య భవన్‌లో ఐద్వా, జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాలుగోరోజు నిత్య జీవితంలో సైన్స్ ఉపయోగాలు, మూఢనమ్మకాలు, శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై అవగాహన కల్పించారు. జేవీవీ నాయకుడు నల్లూరి వెంకట నరసింహం పాల్గొని సైన్స్ పాఠాన్ని బోధించారు. సైన్స్ ప్రాధాన్యతను అందరూ తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మాలతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- సీడీపీఓకు తప్పిన ప్రమాదం



పెద్దదోర్నాలలో ప్రమాదానికి గురైన ఆటో, కారు

పెద్దదోర్నాల: ఎదురుగా వస్తున్న ఆటోను వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ సంఘటన మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం జరిగింది. ఈ సంఘటనతో ఆటో, కారు డ్రైవర్లకు స్వల్ప గాయాలు కాగా కారులో ప్రయాణిస్తున్న పెద్దదోర్నాల ఐసీడీఎస్ సీడీపీఓ కమలకుమారి ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రం నుంచి మార్కాపురం వైపునకు వెళ్తున్న ఆటోను మార్కాపురం వైపు నుంచి మండల కేంద్రం వైపునకు వస్తున్న కారు భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఢీకొంది. ప్రమాదంలో ఆటో బోల్తా పడగా కారు ముందు భాగం దెబ్బతింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కొత్తపల్లిలో పిచ్చి కుక్కల హల్‌చల్



పిచ్చికుక్కల దాడిలో గాయపడిన చిన్నారి చేయి

- నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలు

పెద్దారవీడు: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో పిచ్చి కుక్కలు సోమవారం నలుగురు చిన్నారులను తీవ్రంగా గాయపరిచాయి. చిన్నారులు ఆడుకుంటున్న సమయంలో సాలూరి వరుణ్, కర్ణమాల శ్రీహన్స్, రాము, సత్తి మనోజ్‌పై దాడి చేయడంతో చేతులు, కాళ్లపై రక్త గాయాలయ్యాయి. చిన్నారులను మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. రెండు రోజుల క్రితం రెండు గేదెలు, చిన్నారిని పిచ్చికుక్కలు గాయపరిచాయని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చి కుక్కలను నిర్మూలించాలని సర్పంచ్ వెన్నా సంజీవరాణితోపాటు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.